# కాంగ్రెస్‌కు ఓటమే

## అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు

- అధికార పార్టీకి స్పష్టమైన మెజారిటీ
- 61 సీట్లు గెలుచుకొనే అవకాశం
- నెలలోనే పగిలిన కాంగ్రెస్ బుడగ
- 43-55 సీట్లకే హస్తం పరిమితం
- ఏబీపీ-సీవోటర్ రీసర్వే స్పష్టీకరణ
- బీఆర్‌ఎస్‌కు తిరుగు లేదు.. 72 సీట్లతో హ్యాట్రిక్ పక్కా
- తేల్చిచెప్పిన ఇండియా టీవీ సర్వే



న్యూఢిల్లీ, నవంబర్ 4: కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో వాపు చూసి బలుపు అనుకొన్నదని తేలిపోయింది. అంతన్నాడింతన్నాడే గంగరాజు అన్నట్టు పోలింగ్ దగ్గరపడుతున్నాకొద్దీ ఆ పార్టీ బలం కొడిగడుతున్నదని తాజా సర్వేలో వెల్లడైంది. అధికార పార్టీ బీఆర్‌ఎస్ స్పష్టమైన మెజారిటీ సాధించి ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తుందని తేల్చిచెప్పింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలపై ఏబీపీ-సీవోటర్ సంస్థ మరోసారి నిర్వహించిన సర్వే ఫలితాలను శనివారం ప్రకటించింది. ఈ సర్వేలో బీఆర్‌ఎస్ 49 నుంచి 61 సీట్ల వరకు గెలుచుకొంటుందని తెలిపింది. కాంగ్రెస్ పార్టీ 43 నుంచి 55 సీట్లకే పరిమితమవుతుందని పేర్కొన్నది. బీజేపీకి 5 నుంచి 11 మధ్య, ఇతరులకు 4-10 మధ్య సీట్లు రావచ్చని తెలిపింది.

### నెలలోనే స్పష్టమైన మార్పు

నిజానికి తెలంగాణలో బీఆర్‌ఎస్ ఏనాడూ బలహీనంగా లేదు. విపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఎన్నడూ బీఆర్‌ఎస్‌తో పోటీపడే స్థాయిలో లేవు. అయితే, ఏబీపీ-సీవోటర్ సర్వే అక్టోబర్‌లో నిర్వహించిన సర్వేలో ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కంటే కాంగ్రెస్ అధిక స్థానాలు సాధిస్తుందని తెలిపింది. కాంగ్రెస్‌కు 48-60 సీట్లు, బీఆర్‌ఎస్‌కు 43 నుంచి 55 సీట్లు రావచ్చని విశ్లేషించింది. నెల తర్వాత మళ్లీ సర్వే నిర్వహించింది. ఈ సర్వే సమయానికి కాంగ్రెస్ పార్టీ దాదాపు 10 సీట్ల వరకు బలం కోల్పోయిందని వెల్లడించింది. ఎన్నికల కోసం అభ్యర్థుల ప్రకటన మొదలైన తర్వాత కాంగ్రెస్‌లో అసలు డొల్లతనం బయటపడింది. టికెట్లు ఆశించి భంగపడ్డ నేతలు పార్టీ కార్యాలయాలపైనే దాడులకు తెగబడటం, టికెట్లు వచ్చిన వారికి రెబల్స్ బెడత తీవ్రం కావటంతో ఆ పార్టీ మెజారిటీ సీట్లు సాధించే అవకాశమే లేదని సర్వే తేల్చింది. మరోవైపు ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్.. గత పదేండ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు స్పష్టంగా వివరిస్తుండటంతో న్యూట్రల్‌గా ఉన్న ఓటర్లు కూడా ఆ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నది.

**ఏబీపీ-సీవోటర్ సర్వే (పార్టీలు గెలుచుకొనే స్థానాలు)**

| | అక్టోబర్ | నవంబర్ |
|---|---|---|
| బీఆర్‌ఎస్ | 43-55 | 49-61 |
| కాంగ్రెస్ | 48-60 | 43-55 |
| బీజేపీ | 5-11 | 5-11 |
| ఇతరులు | 4-10 | - |

### బీఆర్‌ఎస్‌కు 72 స్థానాలు: ఇండియా టీవీ

ఇండియా టీవీ సర్వేలో కూడా బీఆర్‌ఎస్ స్పష్టమైన మెజారిటీ సాధిస్తుందని తేలింది. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 72 స్థానాల్లో జయకేతనం ఎగురవేస్తుందని తేల్చింది. కాంగ్రెస్ 33 స్థానాలకే పరిమితమవుతుందని వెల్లడించింది. బీజేపీ 6, ఎంఐఎం 7, ఇతరులు ఒక స్థానంలో విజయం సాధించే అవకాశం ఉన్నదని పేర్కొన్నది.

# బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం

- పథకాలపై ప్రజల్లో సంతోషం
- సెఫాలజిస్టుల ముక్తకంఠం
- ఢిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశం
- బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మెజార్టీ
- సీ-వోటర్ డైరెక్టర్ యశ్వంత్ దేశ్ ముఖ్
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఓట్ల తేడా 18%
- సీఎస్‌డీఎస్ బాధ్యుడు సంజయ్
- కేసీఆరే అత్యంత ప్రజాదరణ ఉన్న నేత : సీనియర్ జర్నలిస్టు పర్స



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న సెఫాలజిస్టులు మనీశ్‌కుమార్, ప్రదీప్‌గుప్తా, సజ్జన్‌కుమార్, యశ్వంత్‌దేశ్‌ముఖ్, రవిరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రముఖ సెఫాలజిస్టులు తేల్చి చెప్పారు. ఇప్పటికీ తెలంగాణలో సీఎం కేసీఆరే అత్యంత ప్రజాదరణ ఉన్న నాయకుడని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ సంపూర్ణ మెజార్టీతో మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ మెజార్టీకి దరిదాపుల్లోకి రావని స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులపై 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ గవర్నెన్స్, పాలసీస్ అండ్ పాలిటిక్స్' (ఐజీపీపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో రౌంట్‌టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలే ఎజెండాగా 'పాలిటిక్స్ ఇన్ సౌత్ ఆఫ్ వింధ్యాస్' పేరుతో ఈ సమావేశం నిర్వహించారు. ఇందులో ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) నుంచి ప్రొఫెసర్ సంజయ్‌కుమార్, యాక్సిస్ మై ఇండియా సీఎండీ ప్రదీప్ గుప్తా, సీ-ఓటర్ డైరెక్టర్ యశ్వంత్ దేశ్‌ముఖ్, ది హిందూ పత్రిక ఢిల్లీ రెసిడెంట్ ఎడిటర్ వర్గీస్ కే జార్జ్, తెలంగాణ రెసిడెంట్ ఎడిటర్ రవిరెడ్డి, ఢిల్లీ జేఎన్‌యూ అసోసియేట్ ప్రొఫెసర్ అజయ్ గుధవర్తి, సీనియర్ జర్నలిస్టు పర్సా వెంకటేశ్వర్‌రావు, ఢిల్లీకి చెందిన పీఎం మ్యూజియం అండ్ లేబొరేటరీకి చెందిన డాక్టర్ సజ్జన్ కుమార్ పాల్గొన్నారు. ఐజీపీపీ డైరెక్టర్ మనీశ్ తివారీ ఈ సమావేశానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తెలంగాణలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ముక్తకంఠంతో చెప్పారు. గతంతో పోల్చితే కాంగ్రెస్‌కు కాస్త హైప్ కనిపిస్తున్నా అధికారంలోకి వచ్చే అవకాశం లేదని తెలిపారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్‌కు ఓట్ల తేడా 18 శాతం ఉన్నదని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్‌కు ఉన్న ప్రజాదరణ, కాంగ్రెస్‌లో జరుగుతున్న అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో 18 శాతం లోటును కాంగ్రెస్ దాటడం అత్యంత కష్టమని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజల్లో అత్యంత సానుకూలత ఉన్నదని వెల్లడించారు. పదేండ్లపాటు కొనసాగిన ప్రభుత్వాలపై కొంత అసంతృప్తి ఉండటం సహజమని, తెలంగాణలో అది తక్కువగా కనిపిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను కాంగ్రెస్ కూడగట్టడం కూడా కష్టమని అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్, బీజేపీ మధ్య చీలిపోతుందని, ఇది బీఆర్‌ఎస్‌కు మరింత మెజార్టీ రావడానికి ఉపకరిస్తుందని విశ్లేషించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో, దేశ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తాయని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐజీపీపీ 'సౌత్ ఆఫ్ వింధ్యాస్' పేరుతో దక్షిణాది రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులపై వరుసగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నది. ప్రముఖ సెఫాలజిస్టులు, రాజకీయ విశ్లేషకులు, స్కాలర్లు, జర్నలిస్టులు, విదేశీ రాయబారులు, దేశ విదేశీ ప్రతినిధులు, తదితరులను భాగస్వాములను చేస్తున్నది. అధికార పార్టీల పనితీరు, ప్రతిపక్షాల తీరు, ఆయా రాష్ట్రాల్లో మారుతున్న రాజకీయ పరిణామాలను విశ్లేషిస్తున్నది.

### అనుమానం అవసరమే లేదు

తెలంగాణలో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావడానికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ పదేండ్లుగా అధికారంలో ఉన్నది. అంతమాత్రాన ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తితో ఉండాలని లేదు. దేశ చరిత్రను పరిశీలిస్తే అనేక మంది ముఖ్యమంత్రులు రెండుమూడుసార్లు, అంతకన్నా ఎక్కువగా వరుసగా ప్రభుత్వాలను నడిపిన చరిత్ర ఉన్నది. తెలంగాణలోనూ ఇదే పునరావృతం కానున్నది. ఇందులో ఎలాంటి అనుమానం అవసరం లేదు.

*- సంజయ్ కుమార్, సీఎస్‌డీఎస్, ఢిల్లీ*

### ప్రచారంలోనూ బీఆర్‌ఎస్‌దే ముందంజ

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 46 శాతం ఓట్లు వస్తే, కాంగ్రెస్‌కు 28 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే తేడా 18 శాతం ఉన్నది. దేశ చరిత్రలో ఏ పార్టీ కూడా ఐదేండ్లలోనే 18 శాతం ఓట్ల లోటును దాటి, అధికారంలోకి రాలేదు. పైగా బీఆర్‌ఎస్‌కు ఓట్ల శాతం తగ్గే అవకాశం కనిపించడం లేదు. గతంతో పోల్చితే ప్రచారం పరంగా కాంగ్రెస్ కాస్త మెరుగ్గా కనిపిస్తున్నా, బీఆర్‌ఎస్ పార్టీయే అందరికన్నా ముందున్నది.

*- ప్రదీప్ గుప్తా, సీఎండీ, యాక్సిస్ మై ఇండియా*

### బీఆర్‌ఎస్‌కు అదే బలం

తెలంగాణ రాష్ట్రం పాలనా సంబంధ సమస్యలు, ఉనికి సమస్యలు, సంక్షేమ రంగ సమస్యలతో ప్రస్థానం మొదలు పెట్టి ఈ స్థాయికి చేరింది. ఇదే బీఆర్‌ఎస్‌కు బలం. తెలంగాణ అభివృద్ధికి ఏం చేశారో చెప్పుకోవడం ద్వారా 2018లో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చింది. ఈసారి అదే జరగనున్నది. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రభుత్వ వ్యతిరేక ఓటును తమవైపుకు తిప్పుకోవడంలో విఫలం అవుతున్నారు.

*- యశ్వంత్ దేశ్ ముఖ్, డైరెక్టర్, సీ-వోటర్*

### బీజేపీ ఎజెండా పనిచేయదు

తెలంగాణలో ఇప్పటికీ అత్యంత ప్రజాదరణ ఉన్న నాయకుడు సీఎం కేసీఆరే. ప్రజలు ఇప్పటికీ 'మనవాడు' అనే భావన ఉన్నది. ఇదే సమయంలో బీజేపీ ఓబీసీ ఓటర్లకు గాలం వేయడంపైనే దృష్టి పెట్టింది. ఈ ఎజెండా సార్వత్రిక ఎన్నికల్లో పనిచేస్తుందేమోగానీ, అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఫలితం ఇవ్వదు.

*- పర్సా వెంకటేశ్వర్‌రావు, సీనియర్ జర్నలిస్టు*

### హైదరాబాద్‌దే కీలకపాత్ర

రాష్ట్రంలో అధికారం దక్కించుకోవాలంటే హైదరాబాద్ అత్యంత కీలకం. హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ఉన్న జిల్లాల నియోజకవర్గాల్లో ఏ పార్టీ బలంగా ఉన్నది, ఏ పార్టీ అధికంగా సీట్లు గెలుచుకుంటుంది అనేది ముఖ్యం.

*- రవిరెడ్డి, ది హిందూ తెలంగాణ రెసిడెంట్ ఎడిటర్*

# అసెంబ్లీకి 40.. లోక్‌సభకు 95 లక్షలు

- అభ్యర్థుల వ్యయ పరిమితి ఖరారు
- నామినేషన్ వేసిన రోజు నుంచే లెక్క
- ఎన్నికల సంఘం ధరలే ప్రాతిపదిక

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలతోపాటు వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థుల గరిష్ఠ వ్యయ పరిమితి ఖరారైంది. గతంలో అసెంబ్లీ ఎన్నికలకు రూ.28 లక్షలుగా ఉన్న అభ్యర్థుల వ్యయ పరిమితిని రూ.40 లక్షలకు పెంచిన కేంద్ర ఎన్నికల సంఘం.. లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిమితిని రూ.95 లక్షలుగా నిర్ణయించింది. మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా రూ.28 లక్షలకు మించి ఖర్చు చేసేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. తెలంగాణ, రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌తోపాటు ఏపీ, బీహార్, గుజరాత్, హర్యానా, తమిళనాడు, కర్ణాటక, కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రూ.40 వరకు ఖర్చు చేసుకునేందుకు వీలుకల్పించింది. నామినేషన్ వేసిన రోజు నుంచి పోలింగ్ జరిగే వరకు అభ్యర్థి చేసే ఖర్చును ఎన్నికల ఖర్చుగా పరిగణిస్తారు. పార్టీ చేసే ఖర్చు అభ్యర్థి వ్యయంలోకి రాదు. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులు చేసే ఖర్చులను బ్యాంకు ఖాతా ద్వారానే నిర్వహించాలి. అందుకోసం నామినేషన్ దాఖలు చేసే నాటికే కొత్తగా కొత్తగా బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయాల్సి ఉంటుంది. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు లేదా ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు ఎలాంటి ఖర్చులు చేయరాదని ఎన్నికల నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల తనిఖీల్లో పట్టుబడిన తాయిలాలను అభ్యర్థుల వ్యయంలో చేర్చాలని ఎన్నికల సంఘం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. రోజువారీగా అభ్యర్థులు చేసే వ్యయంతో పాటు పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు, పోస్టర్లు, టోపీలు, భోజనాలు, వాహనాల అద్దె, వాటి ఇంధన ఖర్చులు, సభా వేదికలు, మైకులు, పత్రికా/టీవీ/సోషల్ మీడియా ప్రకటనలకు చేసే ఖర్చులను కలిపి అభ్యర్థి ఎన్నికల వ్యయంగా లెక్కిస్తారు. వీటిలో ప్రతి దానికీ బిల్లులు చూపించాల్సి ఉంటుంది. వీటన్నింటికి ఎన్నికల సంఘం ధరలను నిర్ణయిస్తుంది. ఆ ధరల ప్రకారమే లెక్కలు చూపించాల్సి ఉంటుంది. ఈ ధరల వివరాలను జిల్లా ఎన్నికల అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఇవి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేర్వేరుగా ఉన్నాయి.

**అభ్యర్థుల గరిష్ఠ వ్యయ పరిమితి**

| రాష్ట్రం | అసెంబ్లీ | పార్లమెంట్ |
|---|---|---|
| తెలంగాణ | రూ.40 లక్షలు | రూ.95 లక్షలు |
| రాజస్థాన్ | రూ.40 లక్షలు | రూ.95 లక్షలు |
| ఛత్తీస్‌గఢ్ | రూ.40 లక్షలు | రూ.95 లక్షలు |
| మధ్యప్రదేశ్ | రూ.40 లక్షలు | రూ.95 లక్షలు |
| మిజోరం | రూ.28 లక్షలు | రూ.95 లక్షలు |

**ఎన్నికల సంఘం నిర్ణయించిన ఆహార ధరలు**

| పదార్థం | పట్టణాల్లో | గ్రామాల్లో |
|---|---|---|
| భోజనం | రూ.80 | రూ.80 |
| టిఫిన్ | రూ.35 | రూ.30 |
| చికెన్ బిర్యానీ | రూ.140 | రూ.100 |
| మటన్ బిర్యానీ | రూ.180 | రూ.150 |
| వాటర్ బాటిల్ | రూ.20 | రూ.20 |
| పులిహోర | రూ.30 | రూ.20 |
| సమోసా (పెద్దది) | రూ.10 | రూ.10 |

**ప్రచార వేదికలు, వాహనాల అద్దెలు**

| | పట్టణాల్లో (ఒక రోజుకు) | గ్రామాల్లో (ఒక రోజుకు) |
|---|---|---|
| ఫంక్షన్ హాల్ | రూ.15,000 | రూ.12,000 |
| ఎల్ ఈడీ స్క్రీన్ | రూ.15,000 | రూ.15,000 |
| డీసీఎం వ్యాన్ | రూ.3,000 | రూ.3,000 |
| ఇన్నోవా కారు | రూ.4,000 | రూ.4,000 |
| బస్సు పెద్దది | రూ.6,000 | రూ.6,000 |
| మినీ బస్సు | రూ.3,500 | రూ.3,500 |
| డ్రోన్ కెమెరా | రూ.5,000 | రూ.5,000 |

# గురుకుల్ టు కార్పొరేట్ కొలువు

- సాకారమవుతున్న పేదింటి బిడ్డల స్వప్నాలు
- దేశానికే ఆదర్శంగా తెలంగాణ గురుకుల విద్య
- ఇప్పటికే రాష్ట్రంలో 1022 రెసిడెన్షియల్ స్కూళ్లు
- అందులో 635 ఇంటర్.. 85 డిగ్రీ కళాశాలలు
- అగ్రవర్ణ పేద విద్యార్థులకు 119 గురుకులాలు
- బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో పెట్టిన కేసీఆర్

*తెలంగాణలో అనతికాలంలో విద్యా విప్లవాన్ని సృష్టించిన బీఆర్‌ఎస్.. అగ్రవర్ణ పేద విద్యార్థుల కోసం సంచలన నిర్ణయం తీసుకొన్నది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బిడ్డలలాగే వారికీ ఉచిత నాణ్యమైన విద్యనందేలా కేసీఆర్ గొప్ప ఆలోచన చేశారు. తెలంగాణలో అగ్రవర్ణ పేద విద్యార్థుల కోసం 119 గురుకులాలను ఏర్పాటు చేస్తామని బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో పెట్టి, అన్ని వర్గాల విద్యార్థుల భవిష్యత్తుకు చుక్కానిలా నిలుస్తామని చాటిచెప్పారు.*



హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో మెరుగైన విద్యను అందించడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు తెలంగాణ సర్కారు విశేష కృషి చేస్తున్నది. పలు ప్రతిష్ఠాత్మక కంపెనీలతో ఒప్పందాలు చేసుకొంటూ గురుకుల విద్యార్థులకు నైపుణ్య శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నది. డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే పై చదువులకు అనుగుణంగా వివిధ పోటీపరీక్షలకు సంబంధించి శిక్షణ ఇస్తున్నారు. కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, మాస్ మ్యూచువల్స్ ఇండియావంటి ప్రముఖ సంస్థలు గురుకులాలకే వచ్చి ప్రాంగణ నియామకాలను చేపడతున్నాయి. ఇప్పటి వరకు మొత్తంగా 1000 మందికిపైగా విద్యార్థినులు నేరుగా డిగ్రీ పట్టా చేతికి వచ్చిరాగానే లక్షల ప్యాకేజీతో కొలువుల్లో చేరడం తెలంగాణ గురుకుల విద్యకు గర్వకారణం. గురుకులాలు అందిస్తున్న అవకాశాలతో అట్టడుగువర్గాల విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకుంటూ.. ఉన్నత ఉద్యోగాలను పొందుతూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు.

### పేదింటి బిడ్డలకు ఉజ్వల భవిష్యత్తు

అట్టడుగు వర్గాల విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే మహనీయులు చూపిన మార్గంలోనే తెలంగాణ ప్రభుత్వం ముందుకుసాగుతున్నది. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న గురుకుల విద్యావిధానం యావత్తు దేశానికే నేడు దిక్సూచిగా నిలుస్తున్నది. అన్ని రంగాల మాదిరిగానే ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాంతం విద్యారంగంలోనూ తీవ్ర వివక్షకు గురైంది. ఈ నేపథ్యంలోనే స్వరాష్ట్రంలో తెలంగాణ విద్యారంగంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కేజీ టు పీజీ ఉచిత విద్యను అందించాలని సంకల్పించారు. తొమ్మిదిన్నరేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఆ దిశగా వడివడిగా బలమైన అడుగులు పడుతున్నాయి. స్వరాష్ట్ర ఏర్పాటు నుంచి క్రమక్రమంగా గురుకులాల సంఖ్యను విస్తరిస్తూ వస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వ్యాప్తంగా కేవలం 293 గురుకులాలు మాత్రమే ఉండగా, అందులోనూ 5-10వ తరగతి వరకు మాత్రమే విద్యనందించేవారు. ఇంటర్, డిగ్రీ గురుకుల కళాశాలల ఊసే లేదే లేదు. కేవలం పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌ను నిర్వహించగా అవి కూడా అంతంతమాత్రమే. ఆయా గురుకులాల్లో వసతులూ నామమాత్రమే. హాస్టళ్లు ఉన్నా విద్యార్థులు లేక అవి బోసిపోయే దుస్థితి. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట వేశారు.



**కేసీఆర్ మాటంటే మాటే**

### అగ్రవర్ణ పేదలకోసం సంచలన నిర్ణయం

తెలంగాణ ప్రభుత్వం 2016-17 నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారీగా గురుకుల పాఠశాలలను క్రమానుగుతంగా విస్తరించుకుంటూ వస్తున్నది. తొలుత నియోజకవర్గానికి ఒకటి చొప్పున నెలకొల్పింది. ఆ తర్వాత 2017-18లో, 2019లోనూ మరోసారి హాస్టళ్ల సంఖ్యను పెంచింది. మొత్తంగా గతంలో ఉన్న గురుకులాలతో కలిపి రెసిడెన్షియల్ గురుకులాల సంఖ్యను 1022కు తీసుకొచ్చింది. అట్టడుగు వర్గాల విద్యాభ్యున్నతికి బాటలు వేసింది. విద్యార్థులకు ఉచితంగా సన్నబియ్యంతో భోజనంతోపాటు మెరుగైన శిక్షణను అందిస్తున్నది. ఒక్కో విద్యార్థిపై 1.25 లక్షలను ఖర్చు చేస్తున్నది. సగటున ఒక్కో గురుకులం ద్వారా 640 మంది చొప్పున ఏటా ఇప్పటికే 6.50 లక్షల మందికిపైగా విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నది. అట్టడుగు వర్గాల బాలబాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దుతూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నది. రాబోయే రోజుల్లో అగ్రవర్ణాల్లోని పేద విద్యార్థుల కోసం 119 గురుకులాలను ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ఇటీవలే ప్రకటించారు. మైనార్టీ విద్యార్థులకు సైతం రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గురుకుల విద్యలో తెలంగాణ ప్రభుత్వం బాలికలకు పెద్దపీట వేస్తున్నది. మొత్తం గురుకులాల్లో 564 గురుకులాలు బాలికలవే కావడం అందుకు నిదర్శనం. మొత్తంగా ఉమ్మడి పాలనలో ఒక్క రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల కూడా అందుబాటులో లేకపోగా, నేడు 85 కళాశాలలను తెలంగాణ సర్కారు ఏర్పాటు చేసింది. అందులోనూ బాలికలకే తొలి ప్రాధాన్యమిచ్చింది.

### ప్రత్యేక గురుకుల కళాశాలలు

తెలంగాణ ప్రభుత్వం బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ(బీజడ్సీ), బీకాం, బీఏ కోర్సులు అందించేలా సాధారణ గురుకుల డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక వృత్తి విద్య గురుకులాలను సైతం నెలకొల్పుతున్నది. డిప్లొమా కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. గురుకులాల్లో కొన్నింటిని ఎక్స్‌లెన్స్ సెంటర్లను ఏర్పాటు చేసింది. బీసీ, ఎస్టీ, ఎస్టీ, మైనార్టీ అన్ని కలిపి మొత్తంగా 50కి పైగా సెంటర్లు ఏర్పాటు చేసింది. మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఐఐటీ, జేఈఈ, నీట్‌తోపాటు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో తర్ఫీదు నిస్తున్నది. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యారంగంలోకి ప్రవేశివేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రాచుర్యం పొందిన ఉన్నత విద్యాసంస్థల్లోనూ అడ్మిషన్లు పొందుతున్నారు.

**ప్రత్యేక గురుకులాలు**

- సైనిక్ స్కూల్ -రుక్మాపూర్
- ఆర్మ్‌డ్ ఫోర్స్ కాలేజీ-భువనగిరి
- బీఏ(హానర్స్)-వికారాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ
- హోటల్ మేనేజ్‌మెంట్-సంగారెడ్డి కాలేజీ
- రెసిడెన్షియల్ లా కాలేజీ-కందుకూరు
- అగ్రికల్చర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ-కరీంనగర్, వనపర్తి

### మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కోర్సులు

తెలంగాణ సర్కారు గురుకులాల్లో మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా, సత్వరమే ఉపాధి అవకాశాల పొందగల కోర్సులను ప్రవేశపెడుతుండటం విశేషం. గురుకుల కళాశాలల్లో నూతన సాంకేతిక కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది.

### ఇంటర్మీడియట్ స్థాయిలో..

ఒకేషనల్‌లో అగ్రికల్చర్ అండ్ క్రాప్ ప్రొడక్షన్, అకౌంటింగ్, ట్యాక్సేషన్, ఆఫీస్ అసిస్టెంట్‌షిప్, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, హోమ్ సైన్స్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపీ, టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులకు శ్రీకారం చుట్టింది.

### డిగ్రీ కళాశాలల్లో..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లర్నింగ్, బీబీఏ, ఇంటర్నేషనల్ రిలేషన్స్, జియాలజి, బిజినెస్ అనలిటిక్స్, జియోగ్రఫీ, డాటా సైన్స్, సోషియాలజి, సైకాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ అండ్ డైట్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ

### గురుకులాల ద్వారా సాధిస్తున్న సత్ఫలితాలివే..

- పది, ఇంటర్, డిగ్రీ పరీక్ష ఫలితాల్లో గురుకుల విద్యార్థులు ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థల సగటు కన్నా ఎక్కువ ఉత్తీర్ణతను సాధిస్తున్నారు.
- కళాశాలల్లో చేరుతున్న ముస్లిం బాలికలు 2014-15లో 16శాతం ఉండగా, 2019-20 నాటికి అది ఏకంగా 43 శాతానికి పెరిగింది. జాతీయస్థాయి సగటు 3 శాతం కాగా, తెలంగాణ వృద్ధి రేటు 26శాతంగా నమోదవడం గర్వకారణం.
- పాఠశాలల్లో చేరుతున్న ముస్లిం బాలికలు గురుకులాల ఏర్పాటుకు ముందు 84శాతం ఉండగా, ప్రస్తుతం 94 శాతానికి పెరిగింది. తెలంగాణ ఏకంగా 10 శాతం వృద్ధి సాధించి జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలవడం గర్వకారణం.
- తొమ్మిదిన్నరేండ్లలో 930 మంది వైద్యవిద్యకు ఎంపికయ్యారు. 1,517 మంది ఎన్ఐటీ, ఐఐటీ తదితర ఉన్నత సంస్థల్లో ఇంజినీరింగ్ ప్రవేశాలను సాధించారు.
- తొమ్మిదిన్నరేండ్ల కాలంలో 6,450 మంది దళిత, గిరిజన, మైనార్టీ విద్యార్థులు టిస్ తదితర జాతీయ, అంతర్జాతీయ యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో సీట్లను పొందారు.
- ప్రతి ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్, ఫెలోషిప్‌ను సాధిస్తున్నారు.
- ఉన్నత విద్యను అభ్యసించే దళిత, గిరిజన, బీసీల సంఖ్య గణనీయంగా పెరిగింది.
- ఎస్టీ, ఎస్సీ, బీసీ బాలికల ఉన్నత విద్యాభ్యాసం కూడా గణనీయంగా పెరిగింది.
- జాతీయ సగటును మించి ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఆయా వర్గాల విద్యార్థులు చేరి ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. ఆలిండియా హయ్యర్ ఎడ్యుకేషన్ సర్వే, యుడైస్ తదితర నివేదికల గణాంకాలన్నీ అందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి.
- ఇప్పటివరకు దాదాపు 1000 మంది విద్యార్థులు నేరుగా గురుకులాల నుంచే వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు.

**ముఖ్యమైన పాయింట్లు..**

| క్యాటగిరీ | 2014కు ముందున్నవి | బాలికలు | బాలురు | మొత్తం | ఇంటర్ వరకు | డిగ్రీ |
|---|---|---|---|---|---|---|
| బీసీ | 19 | 165 | 162 | 327 | 261 | 33 |
| ఎస్సీ | 134 | 175 | 93 | 268 | 238 | 30 |
| ఎస్టీ | 91 | 107 | 79 | 186 | 109 | 22 |
| మైనార్టీ | 12 | 97 | 107 | 204 | 204 | 0 |
| జనరల్ | 37 | 20 | 17 | 37 | 37 | 0 |
| మొత్తం | 293 | 564 | 458 | 1,022 | 849 | 85 |

### తెలంగాణ సర్కారుకు రుణపడి ఉంటా



*మాది మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చర్లపాలెం గ్రామం. నాన్న ధర్మారం నాగయ్య ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్. అమ్మ మహేశ్వరి గృహిణి. 3 నుంచి 10వ తరగతి వరకు చర్లపాలెం ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేశా. ఆ తర్వాత నెక్కొండలోని టీఎస్ ఆర్‌జేసీలో ఇంటర్ పూర్తి చేశా. ఇంజినీర్ కావాలనేది నా చిన్ననాటి కల. గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో లాంగ్‌టర్మ్ కొచింగ్‌లో చేరడం నా జీవితంలో ఓ గొప్ప మలుపు. కార్పొరేట్‌స్థాయి శిక్షణ ఇచ్చారు. అందువల్లే జేఈఈ అడ్వాన్స్‌లో 4,651 ర్యాంకు సాధించా. ఐఐటీ మండిలో ప్రస్తుతం కెమికల్ ఇంజినీరింగ్ చేస్తున్న. నన్ను అన్నివిధాలా ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, ముఖ్యంగా ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.*

*- వాణిశ్రీ, ఐఐటీ మండి*

### గురుకులంలో అందించిన కోచింగ్ వల్లే



మాది కామారెడ్డి జిల్లా జుక్కల్. నాన్న రాములు, అమ్మ ముక్త. మాది సాధారణ కుటుంబమే. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గౌలిదొడ్డి కాలేజీలో కోచింగ్ తీసుకున్న. ప్రైవేట్ ఇన్‌స్టిట్యూషన్స్ కన్నా ఎంతో మెరుగైన శిక్షణ ఇచ్చారు. ఎంసెట్‌లో 3000 ర్యాంకు వచ్చింది. 'గాంధీ'లో ఇటీవలే మెడిసిన్ పూర్తిచేశా. ప్రస్తుతం ముంబైలోని జగ్జీవన్‌రామ్ వెస్టన్ రైల్వే హాస్పిటల్‌లో పీజీ సీటు వచ్చింది. పీడియాట్రిషియన్ కావాలన్నదని నా కోరిక. డాక్టర్ కావాలన్న నా ఆశయాన్ని గౌలిదొడ్డి కళాశాల తీర్చింది. సీఎం కేసీఆర్‌కు నా ప్రత్యేక కృతజ్ఞతలు.

*- గణేష్, ముంబై, జగ్జీవన్‌రామ్ వెస్ట్రన్ రైల్వే హాస్పిటల్*

### మరో నెలలో డాక్టర్ పట్టా చేతికి



మాది హైదరాబాద్‌లోని తార్నాక. డాక్టర్ కావాలన్నది నా కల. ఇంటర్ పూర్తయ్యే సమయానికి నాన్న కోటేశ్వర్ రావు అనారోగ్యంతో కన్నుమూశారు. ఒక్కసారిగా నా కలలన్నీ తలకిందులయ్యాయి. అదే సమయంలో 2015లో ప్రభుత్వం గౌలిదొడ్డి గురుకుల విద్యాలయంలో నీట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించింది. మొట్టమొదటి బ్యాచ్‌లోనే చేరా. అక్కడి శిక్షణతో నీట్‌లో 2000, ఎంసెట్‌లో 5000 ర్యాంకు వచ్చింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కాలేజీలో సీటు దక్కించుకున్నా. అమ్మ కమల, సోదరుడు సాయిచందర్ సహకారంతో ఎంబీబీఎస్ పూర్తి చేశా. సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

*- డాక్టర్ సంధ్య, తార్నాక (భాస్కర్ మెడికల్ కాలేజీ)*